# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 169 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 15 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి

అర్జీల పరిష్కారం, క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి

మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి, మన జనప్రగతి జూలై 14:** డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన

మిగతా2లో...

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 14:** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు.

మిగతా2లో...

# ఓటర్ల జాబితా సవరణ సర్ గడువు పొడగింపు

- 24 వరకు పొడిగిస్తూ ఇసి ఆదేశాలు



**అమరావతి,మన జనప్రగతి జూలై 14:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణషెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించింది. సర్ గడువును ఈనెల 24 వరకూ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

మిగతా2లో...

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!



**అమరావతి, మన జనప్రగతి జూలై 14:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమంతో ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 73 ఏళ్ల వయసులో అందర్నీ విషాదంలో

మిగతా2లో...

## బోటు ప్రమాదం జరిగిన వెంటనే

# స్పందించని సర్కార్

- ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
- మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ
- సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత



**విశాఖపట్నం,మన జనప్రగతి జూలై 14:** విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

మిగతా2లో...




## ఐదేళ్ళ వైసిపి పాలనలో 270మంది

# మత్స్యకారుల మృతి

ప్రకృతి వైపరీత్యాలతోనూ అనేక మంది మృత్యువాత

వాటికి జగన్‌ను తాము ఏనాడూ బాధ్యులను చేయలేదు

జగన్ విశాఖ పర్యటనపై మండిపడ్డ మంత్రి అచ్చన్న

**అమరావతి, మన జనప్రగతి జూలై 14:** ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి అనేక మంది మత్స్యకారులు చనిపోయారని, విపత్తుల కారణంగా మొత్తం 270 మంది మృతిచెందారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అయితే, జగనే వారిని చంపేశారని అంత అవివేకంగా తాము మాట్లాడమని అన్నారు. నాడు మృతిచెందిన 270 మందిలో ఏ ఒక్క కుటుంబాన్ని ఇప్పటివరకు ఎందుకు పరామర్శించలేదని

మిగతా2లో...

# 201 కుటుంబాలకు వందేళ్ల సమస్యకు పరిష్కారం

పుల్లడిగుంట గ్రామ ప్రజలకు తీపి కబురు

నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కులు

శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కుంగుంది బాటలో

పుల్లడిగుంట: మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, మన జనప్రగతి జూలై 14:** దీర్ఘకాలికంగా నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని గ్రామాలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. తాజాగా వందేళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని పుల్లడిగుంట గ్రామ ప్రజలందరి సమస్యను తీర్చింది. ఈ గ్రామంలో ఉన్న 201 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లు అన్ని కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. వందేళ్ల క్రితమే ఈ గ్రామంలో ఇళ్లు నిర్మించుకున్నారు. ఎప్పటి నుండో

మిగతా2లో...



# ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి

త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

**అమరావతి,మన జనప్రగతి జూలై 14:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి

మిగతా2లో...

## తిరుమలలో కోయిల్ ఆళ్వార్

# తిరుమంజనం

సుగంధ ద్రవ్యాలతో ఆలయశుద్ధి నిర్వహణ



2లో

# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." 2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్ధిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు. **అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన** 'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి.ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నానను.' అని ముఖ్యమంత్రి అన్నారు. **నాలుగు గోడలు దాటి వెళ్లాలి** ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ముందు చూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం. ప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌ఓడీలు హాజరయ్యారు.

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ-ఉక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు.

# బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు పోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లు మన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రోడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 201 కుటుంబాలకు వందేళ్ల సమస్యకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పంచాయితీకి పన్నులు కడుతున్నారు. చాలా ఏళ్ల కాలం నుండి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కార్నెపాడు రెవెన్యూ గ్రామానికి హెమ్లేట్ గా ఉన్న పుల్లడిగుంట ప్రజలు తమ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. తోపు పోరంబోకుగా వర్గీకరించబడ్డ తమ గ్రామం మొత్తం ఉన్న ప్రాంతాన్ని నిషేధిత జాబితా నుండి తొలగించి గ్రామ ప్రాంతం గా వర్గీకరించాలని కోరుతూ ఆ గ్రామ పంచాయితీ తీర్మానం చేసి పంపించింది. ఈ సమస్య తీవ్రతను గమనించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు అధికారులతో గ్రామ రికార్డులను పరిశీలించారు. వందేళ్ల నుండి అక్కడ ప్రజలు ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని, 8.51 ఎకరాల్లో ఇళ్లు, అంతర్గత రోడ్లు నిర్మించి ఉన్నాయని రీ సర్వేలో తేలిందని నిర్ధారించారు. ఈ ఇళ్లకు పక్కనే ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజిద్ కూడా ఉంది. వీటితోపాటు ఎకరం 27 సెంట్లు ఖాళీ భూమి కూడా ఉంది. జిల్లా అధికారుల నుండి వచ్చిన నివేదిక ఆధారంగా తోపు పోరంబోకుగా ఉన్న భూమిని గ్రామ ప్రాంతంగా మార్చాలని, ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొనాలని, ఇళ్ల స్థలాలు ఉన్న 8.51 ఎకరాలను నిషధిత జాబితా నుండి తొలగించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. అదే విధంగా పక్కనే ఉన్న ఎకరం 27 సెంట్లను ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ, ఈ స్థలం తోపాటు ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజీద్ స్థలాలను నిషేధిత జాబితాలో ఉంచాలని కోరుతూ రాష్ట్ర మంత్రి వర్గానికి ప్రతిపాదనలు పంపగా అనుమతి లభించింది. దీంతో పుల్లడిగుంట వందేళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనున్నారు. **మున్ముందు మరిన్ని దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలకు పరిష్కారం** దీర్ఘకాలికంగా పెడింగ్ లో ఉండి హక్కులకు నోచుకొని గ్రామలకు విముక్తి కల్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా శెట్టి పల్లి గ్రామంలో దశాబ్దాల కాలం నుండి హక్కుల్లేక ఇబ్బందులు పడుతున్న రెండు వేలమంది సమస్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగు నింపామన్నారు. అదే విధంగా బ్రిటీష్ అధికారుల చేసిన పొరపాటు కారణంగా 120 ఏళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉన్న మండల కేంద్రమైన వట్టి చెరుకూరులోని 5వేల మంది ప్రజలకు వారి ఆస్తులపై హక్కులు కల్పించామన్నారు. ఆ తర్వాత కుప్పం నియోజకవర్గంలోకి కుంగుంది గ్రామంలో 61 ఏళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 322 మంది పేదలకు డికెటీ పట్టాలను అందజేశామన్నారు. వ్యక్తులకు కాకుండా సమూహంగా ఒకే రకమైన సమస్య ఎదుర్కొంటున్న వారికి హక్కులు కల్పించేందుకు రెవెన్యూ శాఖ విశేషంగా కృషి చేస్తోందని, మున్ముందు ఇలాంటి సమస్యలున్న గ్రామాలకు విముక్తి కల్పిస్తామని మంత్రి అనగాని తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ సర్ గడువు పొడగింపు

(మొదటి పేజీ తరువాయి)

2026 జులై 1ను అర్హత తేదీగా నిర్ణయించి సవరణ పక్రియను కొనసాగించనున్నట్లు వెల్లడించింది. సవరించిన షెడ్యూల్‌ను రాష్ట్రంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇదే గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ పక్రియను కూడా పూర్తి చేయనున్నారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. అనంతరం అక్టోబర్ 3, 2026న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రచురించనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణలు వంటి పక్రియలు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతూ ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. తండ్రి వీర రాఘవరావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 1978లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా ముద్రగడ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా సేవలందించారు.కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ముద్రగడ మంగళవారం సాయంత్రం ప్రాణాలు విడిచారు. హైదరాబాద్ సింధు ఆస్పత్రిలో శ్వాసకోస సమస్యకు చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ముద్రగడ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఏపీలో విషాదం నెలకొంది.

# ముంబయిలో పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# ఐదేళ్ళ వైసిపి పాలనలో 270మంది మత్స్యకారుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌ను మంత్రి అచ్చెన్న ప్రశ్నించారు. విశాఖలో పర్యటించిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మొలసి కన్నీరు కాలర్చడంపై అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం అయ్యారు. మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని మంత్రి అచ్చెన్న మండిపడ్డారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ..'గొడ్డలి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నేడు విశాఖ పర్యటనకు వెళ్లారు. మీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఓ వ్యక్తిని తన వాహనంతో ఢీకొట్టాడు. వైద్యం చేయించకపోవడంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ వ్యక్తిని పలకరించడానికి వెళతావేమో అనుకున్నా. గొడ్డలి పార్టీ అబద్దాల పునాదులపై పుట్టింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల విశాఖలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. అలాంటి విపత్తుల సమయంలో వెంటనే స్పందించి వారి ప్రాణాలు కాపాడే చరిత్ర సీఎం చంద్రబాబు నాయుడిది. ప్రభుత్వం వెంటనే స్పందించినా సాంకేతిక కారణాల వల్ల మత్స్యకారుల బోటు ఎక్కడ మునిగిపోయిందో తెలియక కాపాడలేకపోయాం అన్నారు. నెల 4వ తేదీన ఉదయం 10:30 గంటలకు బోటు గల్లంతైనట్లు మాకు సమాచారం అందింది. ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో ప్రతి బోటుకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేశాం. విపత్తు వచ్చినప్పుడు ట్రాన్స్‌పాండర్‌ను నొక్కితే సమాచారం తెలుస్తుంది. ట్రాన్స్‌పాండర్‌ను నొక్కిన వెంటనే వారు ఏ ప్రాంతానికి వెళ్లారో తెలుసుకుని, 11:30 గంటలకు కోస్ట్ గార్డ్, నేవీకి సమాచారం ఇచ్చి ఆపరేషన్ ప్రారంభించాం. నేడు కిలోమీటర్లకు, నాటికల్ మైళ్లకు తేడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారు. 11 నాటికల్ మైళ్ల దూరంలో సంఘటన జరిగింది. వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి బాధిత కుటుంబసభ్యుల వద్దకు, పోర్టు వద్దకు పంపాం. 30 ఏళ్లుగా ఏ సంఘటన జరిగినా వెంటనే అక్కడ ఉండే వ్యక్తి అచ్చెన్నాయుడు. నీ పాలనలో 270 మంది చనిపోతే కనీసం పరిహారం ఇవ్వలేదు. వైసీపీ అధికారం కోల్పోయాక ఎన్డీఏ ప్రభుత్వం ఆ పరిహారం ఇచ్చింది. మీకు తల్లి లేదు, చెల్లి లేదు, బాబాయి లేరు.. అందర్నీ చంపేస్తావు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మీ మంత్రి (సీదిరి అప్పలరాజు) నాడు మాట్లాడారు. మీ మాజీ మంత్రి కుమారుడు ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతోనే దానయ్య చనిపోయారు. వెంటనే ఆస్పత్రిలో చేర్చి ఉంటే దానయ్య బతికేవారు. మేము మాత్రం గల్లంతైన ఏడుగురిలో ఓ మత్స్యకారుడిని సురక్షితంగా కాపాడాం. ఆస్పత్రికి తరలించి మంచి చికిత్స అందించాం. జగన్ చేసే చౌకబారు వ్యాఖ్యలను నమ్మేందుకు ఆంధప్రదేశ్ ప్రజలు సిద్ధంగా లేరని మంత్రి అచ్చెన్న చెప్పుకొచ్చారు.

# తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## - సుగంధ ద్రవ్యాలతో ఆలయశుద్ధి నిర్వహణ

**తిరుమల,మన జనప్రగతి జూలై 14:** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. 17న సాలకట్ల ఆణివార అస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టిటిడే ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను టిటిడే రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టిటిడే జేఈవో డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో లోకనాథం, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

15 - 07 - 2026

# భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 14:-**భవ్య పథకం వర్తింపుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఏపీఐఐసీ కి సంబంధించి భవ్య పథకం కింద భూసేకరణ,గుట్టపాడు వద్ద ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మాణం అంశాలపై ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భవ్య పారిశ్రామిక పథకం వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి లొద్దిపల్లి,మీదివేముల వద్ద భూసేకరణ గురించి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఓర్వకల్లు తహసీల్దార్ లతో చర్చించారు. ఇందుకు సంబంధించిన చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా గుట్టపాడు వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం గురించి ఇరిగేషన్, ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల ఇరిగేషన్ ఎస్ ఈ శుభకుమార్, డిఈ కిష్టన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన..

**- జిల్లా జడ్జి పర్యటన..ఆగస్టు 22న ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సూచన**



**పత్తికొండ మన జనప్రగతి జూలై 14:-** పత్తికొండలో మంజూరైన అడిషనల్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన భవనాలను జిల్లా జడ్జి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న రైతు సేవా కేంద్రం,సచివాలయాలు4, 6 భవనాలను పరిశీలించి, కోర్టు నిర్వహణకు అనువైన వసతులపై అధికారులతో చర్చించారు. అలాగే కోర్టు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులతో సమావేశమైన జిల్లా జడ్జి, గోనెగండ్ల మండలం ఎమ్మిగనూరు కోర్టు పరిధిలోకి మారుతుందనే ప్రచారానికి తెరదించారు. గోనెగండ్ల మండలం యథావిధిగా పత్తికొండ కోర్టు పరిధిలోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఆగస్టు 22న అడిషనల్ కోర్టు ప్రారంభోత్సవం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జోష్న దేవి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబుకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయానికి 'ప్రైవేటు' గండి..!

- ఉరవకొండ డిపో సమీపంలో వందకు చేరువలో వాణిజ్య వాహనాలు..
- నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యమా..?



**ఉరవకొండ మన జనప్రగతి జూలై 14:-**ప్రభుత్వం ఆర్టీసీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్న వేళ, ఉరవకొండ అనంతపురం మార్గంలో పెరుగుతున్న ప్రైవేటు వాణిజ్య వాహనాలు సంస్థ ఆదాయానికి భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఉరవకొండ డిపో సమీపంలోనే ప్రైవేటు వాహనాలు నిలిపి ప్రయాణికులను తరలిస్తున్నప్పటికీ, సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సుమారు 54 వాహనాలు నిత్యం తిరుగుతున్నాయని, త్వరలో ఈ సంఖ్య వందకు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.ఉరవకొండ నుంచి అనంతపురానికి ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో వాహనం రోజుకు వేల రూపాయల ఆదాయం పొందుతుండగా, ఈ కారణంగా ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.డిపో ఎదుటే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం బహిరంగంగా జరుగుతున్నా అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రవాణా శాఖ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు అంటున్నారు.మరోవైపు చట్టబద్ధంగా పర్మిట్లు, పన్నులు, బీమా, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలతో వాహనాలు నడుపుతున్న వారికి నష్టం జరుగుతోందని కొందరు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రయాణికుల భద్రత, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ కోసం ఆర్టీసీ, రవాణా శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన

**కడప మన జనప్రగతి జూలై 14:-** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నిర్మలా ఇంగ్లీష్ మీడియం స్కూల్, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా మాధకద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా కడప 2 పట్టణ సిఐ శ్రీహరి మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.ప్రిన్సిపాల్ విజయారాణి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి సమాజానికి ఉపయోగపడాలని హితువు పలికారు.ఈగల్ టీమ్ అయూబ్ ఖాన్, గురుశేఖర్ లు విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు."పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది.ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సానుకూల దృక్పథం 80 శాతానికి చేరాలి

**గ్యాస్ డెలివరీలో అదనపు వసూళ్లపై ఏజెన్సీలకు కలెక్టర్ హెచ్చరిక**



**కర్నూలు మన జనప్రగతి జూలై 14:-**జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా సేవలు అందించి, ప్రజల సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) 80 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, డెలివరీ సమయంలో అదనపు డబ్బులు వసూలు చేయడం వల్ల ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోందని తెలిపారు.ఇప్పటికే పలుమార్లు సూచనలు, శిక్షణ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదన్నారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇప్పటికే మూడు గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నట్లు, కొన్ని ఏజెన్సీలకు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. పెద్దకడుబూరుకు చెందిన మాధురి గ్యాస్ ఏజెన్సీపై పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆ ఏజెన్సీ వినియోగదారులను సమీపంలోని మరో ఏజెన్సీకి ట్యాగ్ చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ...గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు సొమ్ము వసూలు చేయరాదని, వారికి జీతాలు బ్యాంకు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారానే అందించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీల పనితీరు, డెలివరీ సిబ్బంది వివరాలను సమీక్షించారు. జీతాలు, వాహనాల వివరాలను జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, ఏడి మార్కెటింగ్ నారాయణమూర్తి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారులు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్లను పగలగొట్టి కాపర్ వైర్ చోరీ



**వీరబల్లి మన జనప్రగతి జూలై14:-** మండలంలో విద్యుత్ మోటార్లను పగలగొట్టి వాటిలోని కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన వీరబల్లి మండలంలోని దిగువ రాచపల్లి పంచాయతీ లో చోటు చేసుకుంది.ఈ వారంలో తోళ్ల గురయ్య కాపర్ వైర్ 120 మీటర్లు, దామోదర్ రెడ్డి కాపర్ వైర్ 10 మీటర్లు, అశోక్ కుమార్ రెడ్డి 10 మీటర్లు, మంజులమ్మ 15 మీటర్లు, ప్రమీలమ్మ 10 మీటర్లు, కృష్ణారెడ్డి 10 మీటర్లు, జై చంద్ర రెడ్డి 15 మీటర్లు, రత్నాకర్ రెడ్డి 10 మీటర్లు, శివారెడ్డి 10 మీటర్లు, ఆమూరి ఈశ్వరయ్య180 మీటర్లుఇంతమంది రైతులకు సంబంధించిన దాదాపు400మీటర్ల కాపర్ వైర్లను గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. గ్రామ శివారులో 9 మంది రైతుల మోటార్ల నుంచి వైరు దొంగలించారు. గత కొన్ని రోజులుగా పలు గ్రామాలలో విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ చోరీలు జరుగుతుండడంతో రైతులు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల ఎస్సై,సీఐ,డి.ఎస్.పి,పోలీస్ వ్యవస్థ దర్యాప్తు చేపట్టాలని వారు కోరారు.

## పెద్ద రంగాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**- నూతన బోర్ పాయింట్‌ను పరిశీలించిన వైఎస్ మనోహర్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 14:-**పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పెద్ద రంగాపురం గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి వైకాపా మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి చొరవ తీసుకున్నారు.మంగళవారం ఆయన గ్రామస్థులతో కలిసి పర్యటించి,తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు వీలుగా నూతన బోర్ పాయింట్ ఏర్పాటు చేసే స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామస్థులతో సమావేశమై, గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ వంటి పలు ఇతర స్థానిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రజా సమస్యలన్నింటినీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైకాపా ముఖ్య నాయకులు హాల్ గంగాధర్ రెడ్డి, పార్నపల్లి కిషోర్,రామ్ లక్ష్మణ్ రెడ్డి,రామకృష్ణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,జయరామి రెడ్డి,బలక్కగారి ప్రతాప్ రెడ్డి, రామనాథ రెడ్డితో పాటు వార్డు ప్రజలు,వైకాపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మై భారత్ నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్‌లో వెంకట లోకేష్‌కు జాతీయ స్థాయిలో 5వ స్థానం

**- ఏపీ స్థాయిలో ప్రథమ స్థానం**

**- లక్నోలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్న విద్యార్థి**



**వీరబల్లి మన జనప్రగతి జూలై 14:-**కడప జిల్లా వీరబల్లి మండలంలోని ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి స్వామికేరి వెంకట లోకేష్ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. మై భారత్ పోర్టల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్ ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో 5వ స్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి, వీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ వెంకట లోకేష్ సాధించిన విజయం కళాశాలకు, జిల్లాకు గర్వకారణమని తెలిపారు. ఈ నెల 17న లక్నోలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా వెంకట లోకేష్ ప్రశంసాపత్రం అందుకోనున్నట్లు వెల్లడించారు.విద్యార్థి విజయంపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు..!



**వీరబల్లి మన జనప్రగతి జూలై 14:-**మండల కేంద్రం రాయచోటి వీరబల్లి రహదారి యందు స్థానిక ఎస్సై సుస్మిత తన సిబ్బందితో వెళ్లి వాహనాల తనిఖీలను మంగళవారం నిర్వహించినది. ఈ సందర్భంగా ఆమె వాహనాలకు రికార్డులు పరిశీలించడం జరిగింది.రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించడం జరిగింది. అదేవిధంగా డ్రైవర్లకు లైసెన్సులు, హెల్మెట్ లేని వారికి కూడా జరిమాణాలు విపించడం జరిగింది.మధ్యాహ్నం నుండి మండల చుట్టుపక్కల రహదారుల యందు వాహనాల తనికెలను చేయడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ...వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రభుత్వ సూచనల మేరకు రికార్డులు, ఇన్సూరెన్స్,లైసెన్సులు తప్పగా కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించి నడపాలన్నారు. ట్రాఫిక్ సూచనలు పాటించని వారిపైన కఠినమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాదుల కల్పనే లక్ష్యంగా పని చేయాలి

**- వెలుగు పిడి రాజ్యలక్ష్మి**

**వీరబల్లి మన జనప్రగతి జుజులై14:-**జీవనోపాదుల కలపనే లక్ష్యంగా వెలుగు సిబ్బంది పనిచేయాలని, కడప జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథకసంచాలకులు రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో ని వెలుగు కార్యాలయంలో సిబ్బందిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకు, ఉన్నతి, స్త్రీనిధి మరియు ప్రభుత్వ పథకాలైన పి.యం.ఈ.జి. పి.సూక్ష్మ మైక్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను అర్హులందరికీ అందించి వారి కుటుంభ ఆధాయాలను రెట్టింపు అయ్యేలా చర్యలు తీసుకువాలన్నారు .ప్రతికుటుంభంలో ఒక పారిశ్రామిక వేత్తలను తయారుచేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.మునగ ప్రాసెస్సింగ్ ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి 2 లక్షల వచ్చే విధంగా కృషి చే స్తున్నామన్నారు.మునగను ప్రతి ఒక్కరు దైనందిన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మెలన్నారు. మునగ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఆసక్తిగల రైతులతో మునగ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఏపీయం ఖాదర్ వలి, సీసీలు కృష్ణయ్య, సుధాకర్, గంగాధరం,నాగేంద్ర, నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

**- ఏలినో ప్రభావంతో తక్కువ నీటి పంటలే మేలు**

**- టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి**

**తొండూరు మన జనప్రగతి జూలై 14:-**రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ముద్దనూరు సబ్ డివిజన్ టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి సూచించారు. తొండూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాజు, టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.రాజు మాట్లాడుతూ మండలానికి 50 శాతం రాయితీతో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఏలినో ప్రభావం ఎక్కువగా ఉన్నందున తక్కువ నీటితో సాగు చేసే పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు.

## అమావాస్య సందర్భంగా మానసాదేవి ఆలయంలో విశేష పూజలు





**సిద్ధవటం మన జనప్రగతి జూలై 14:**-మండలంలోని కడపచెన్నై జాతీయ రహదారిపై కనుమ లోపలి సమీపంలో వెలసిన శ్రీ మానసాదేవి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం,పంచామృతాభిషేకం,కుంకుమార్చన, అగ్నిహోమం తదితర ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి శర్మ మాట్లాడుతూ కడప, ఒంటిమిట్ట, నందలూరు,చిన్నచౌకు తదితర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

## ప్రభుత్వ భూముల కబ్జాపై కఠిన చర్యలు

**- తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరిక**



సిద్ధవటం మన జనప్రగతి జూలై 14:-ప్రభుత్వ రెవెన్యూ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, జ్యోతి రెవెన్యూ పరిధిలోని సర్వే నం. 413/113లో ఉన్న 4 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టడంతో పాటు, సంబంధిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ రెవెన్యూ భూములు, డీకేటీ భూములు, అసైన్డ్ భూములు, ఇతర ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు రెవెన్యూ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.

## 17లోగా అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి



**వేంపల్లె మన జనప్రగతి జూలై 14:**-వేంపల్లె వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన వారు ఈనెల 17 లోగా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఉషశ్రీ పేర్కొన్నారు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.కళాశాలలో విద్యార్థులకు బోధన చేసేందుకు వృక్ష శాస్త్రం-1, గణిత శాస్త్రం-1, కంప్యూటర్ సైన్స్ విభాగం-1 , చరిత్ర విభాగం-1 పాఠ్యాంశాలకు సంబంధించి అతిథి అధ్యాపకుల అవసరం ఉందన్నారు.ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 17 వ తేదీ లోపు పైన తెలుపబడిన సబ్జెక్టులకు సంబంధించి వారి బయోడేటాలను కళాశాలలో అందజేయాలని ఆమె కోరారు. అభ్యర్థులకు పీ.జీలో 55 శాతం మార్కుల పర్సంటేజీ ఉండాలన్నారు. పోస్టుల భర్తీలో పీహెచ్డి,నెట్, స్లెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె వెల్లడించారు.

## ఖరీఫ్‌లో ఆరుతడి పంటల సాగు ఉత్తమం

**● మండల వ్యవసాయ అధికారి రమేష్**



**లింగాల మన జనప్రగతి జూలై 14:**-ఈ ఏడాది ఎలినినో ప్రభావంతో అధిక ఎండ తీవ్రత, వర్షాలు తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. లింగాల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సాధారణ వర్షపాతం కన్నా 40 శాతం తక్కువ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.ఎల్నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్ కి సంబంధించి జూన్ నుంచి ఆగస్టు వరకు వర్ష పాతం తక్కువ ఉండే అవకాశం ఉందని, బోర్ల కింద సాగు చేసే రైతులు ఆరుతడి పంటలు వేయాలన్నారు. భూసార పరీక్ష ఆధారంగా పంటకు ఎరువులు, సాగు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లోపాట్నూతల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ రెడ్డి మినుము పంటను పరిశీలించి పురుగు ఉధృతిని ఉందని రైతుకు ఇమమెక్టిన్ బెంజోఎట్ 0.4 గ్రాములు మరియు 19:19:19 లీటర్ నీటికి 10 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే పంటలు సాగు చేసే ప్రతి రైతు కూడా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలియజేశారు..ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నేడు ఏలినినో ప్రభావం వల్ల వర్షపాతం చాలా తక్కువ శాతం నమోదు కావడం జరిగింది,దానికి ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం విధానములో విత్తన గుళికలు తయారుచేసి విత్తుకోవాలని రైతులకు డెమో చేసి రైతు సేవ కేంద్రం ముందు చూపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది రాణి,యూనిట్ ఇన్చార్జి జయనాయక్, ఐసిఆర్పి, రైతులు పాల్గొన్నారు.

## పులివెందుల ఫుడ్ టెక్నాలజీ కాలేజీకి అరుదైన గౌరవం

**- జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన శ్రీలేఖ**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 14:**-జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థిని అద్భుత ప్రతిభ కనబరిచింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు పి ఎస్ సి ) విడుదల చేసిన ఫలితాలలో కళాశాలకు చెందిన చింతా శ్రీలేఖ దేశంలోనే మొదటి ర్యాంకు సాధించి సంచలనం సృష్టించింది.ఈ అపూర్వ విజయంతో ఆమె కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ అధికారికంగా ప్రకటించారు.జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించడం ద్వారా చింతా శ్రీలేఖ కేంద్ర సూక్ష్మ,చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు సంబంధించిన డెవలప్మెంట్ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ - ఆహార విభాగం) గా ఎంపికయ్యారని తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సాధించిన ఈ ఘన విజయం పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకే కాకుండా,ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.ప్రతిభ చాటిన విద్యార్థిని శ్రీలేఖను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.కళాశాలలో ఉన్న అంకితభావం గల అధ్యాపక బృందం,నాణ్యమైన బోధనా పద్ధతులు మరియు అత్యాధునిక ప్రయోగశాలల (ల్యాబ్స్) వల్లే విద్యార్థులు ఇలాంటి జాతీయ స్థాయి అత్యుత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నారని డాక్టర్ మాధవ ఈ సందర్భంగా కొనియాడారు.

## హిందూ స్మశాన వాటికలో చెత్త డంపింగ్ నిలిపివేయాలి

**- జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 14:**-సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్కేఆర్ నగర్ హిందూ స్మశాన వాటికలో చెత్త డంపింగ్ చేయడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 902లో ఉన్న స్మశాన వాటికను గ్రామ ప్రజలందరూ వినియోగిస్తున్నారని,గ్రామపంచాయతీ చెత్తను అక్కడే వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. స్మశాన వాటిక హద్దులు, సమీప చెరువు విస్తీర్ణాన్ని సర్వే చేసి హద్దులు నిర్ధారించడంతో పాటు అక్కడ చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రకారం గౌరవప్రదమైన జీవన హక్కులో భాగంగా అంత్యక్రియలకు తగిన ప్రజా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గ్రామస్థులు పేర్కొన్నారు. స్మశాన వాటికను పరిరక్షించి పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి..

**- పి.టి.ఎల్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు డిమాండ్**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 14:**-ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి హక్కులను పరిరక్షించాలని పి టి ఎల్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని ఉప విద్యాశాఖాధికారి శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో ప్రధానంగా జీవో ఎంఎస్ నెం.1ను అమలు చేయడంతో పాటు, 1982 నిబంధనలు మరియు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలని కోరారు.అదేవిధంగా జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన సమయపాలనను పాటించడం లేదని, సాయంత్రం 4 గంటలకు ముగియాల్సిన తరగతులను 'స్టడీ అవర్స్' పేరుతో సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగిస్తూ ఉపాధ్యాయులతో అదనపు పని చేయిస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యలపై జిల్లా విద్యాశాఖాధికారి, డిప్యూటీ డీఈఓ తో పాటు సంబంధిత పాఠశాల యాజమాన్యాలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ శామ్యూల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేట్ ఉపాధ్యాయుల న్యాయపరమైన హక్కులను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని గడ్డం రాజు కోరారు.

## జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్ష సమావేశం

**● పులివెందులలో వంద శాతం జల్ జీవన్ మిషన్ పనులే లక్ష్యం**

**● పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 14:**- పులివెందుల నియోజకవర్గంలో రక్షిత మంచినీటి సరఫరా లక్ష్యంగా సాగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అధికారులను ఆదేశించారు.మంగళవారం పులివెందుల ఆర్&బి అతిథి గృహంలో జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల టీడీపీ సీనియర్ నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డితో పాటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు,మెగా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.సమీక్షా సమావేశంలో భాగంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులు పనుల అమలులో ఎదురవుతున్న కొన్ని క్షేత్రస్థాయి సాంకేతిక,ఇతర సమస్యలను బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై బీటెక్ రవి సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే సంబంధిత అధికారులు,స్థానిక రైతులు మరియు పోలీసులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి,పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ చక్రాయపేట మండలంలోని గడ్డంవారిపల్లె, సురభి,కల్లూరిపల్లె గ్రామ పంచాయతీలలో ప్రస్తుతం కొనసాగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆగస్టు మొదటి వారంలోగా సంపూర్ణంగా పూర్తి చేయాలన్నారు.చక్రాయపేట మండలంలో ఈ పనులు పూర్తయితే పులివెందుల నియోజకవర్గం మొత్తం జల్ జీవన్ మిషన్ పనులు వంద శాతం పూర్తయినట్లేనని అన్నారు.నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పనులు విజయవంతంగా పూర్తయిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని పులివెందుల నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నట్లు బీటెక్ రవి వెల్లడించారు.తాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి ఇంటికీ జల సంకల్పాన్ని చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

## వెలుగుపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి లీకేజీ,వీధిదీపాల సమస్యతో ప్రజల ఇబ్బందులు





**సిద్ధవటం మన జనప్రగతి జూలై 14:**-మండలం వెలుగుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ,వీధిదీపాలు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న కాలనీలోకి విషపురుగులు, వన్యప్రాణులు సంచరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అలాగే తాగునీటి పైపు పగిలిపోవడంతో నీరు వృథాగా పోవడమే కాకుండా,ట్యాంకు సమీపంలో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొని దోమలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. దుర్వాసన వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని విమర్శించారు.ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, సమస్యలను పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో దుప్పట్లు సామగ్రి పంపిణీ

**రామాపురం మన జనప్రగతి జులై 14:**- లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో బి రాచపల్లి ఎంపీపీ స్కూలు మరియు రామాపురం మండలంలోని అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ కు దుప్పట్లను మరియు పలకలు (స్లేట్స్) రిటైర్డ్ ఎస్బిఐ క్యాష్ ఆఫీసర్ చిత్తూరు వాస్తవ్యులు సుబ్రమణ్యం ఆర్థిక సహాయంతో అందజేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్.అంజిరెడ్డి తెలిపారు.అనంతరం దాత రిటైర్డ్ ఎస్బిఐ క్యాష్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేను రాయచోటి ఎస్బిఐ బ్యాంకు నందు మరియు లయన్ వి నారాయణరెడ్డి కలిసి పది సంవత్సరాలు పనిచేయడం జరిగిందని అలాగే నేను ఇప్పటికి15 సంవత్సరాలు రిటైర్డ్ కావడం జరిగినది అయినప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ప్రతి సంవత్సరము ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలియజేశారు.అలాగే మంగళవారం కూడా రామాపురం మండలంలోని బి రాచపల్లి ఎంపీపీ స్కూలు మరియు అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ కు దుప్పట్లను మరియు పలకలు (స్లేట్స్) అందజేసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.అనంతరం ఎంఈఓ సి రామకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు గతంలో కూడా రామాపురం మండలంలో మంచి సేవా కార్యక్రమాలు చేశారని ఈ సంవత్సరం మా మండలంలో అన్ని హైస్కూల్లో కస్తూరిబా లో మెడికల్ క్యాంపులు చేసి పిల్లలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు అధ్యక్షులు లయన్ ఎస్ ఆంజనేయ రెడ్డివారు మాట్లాడుతూ రామాపురం మండలంలో మాక్సిమం అన్ని స్కూళ్లకు క్యాంపులు చేసి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.యస్.హరినాథ్ రెడ్డి,సీనియర్ లయన్ సభ్యులు లయన్ వి.నారాయణ రెడ్డి బి రాచపల్లి ఎంపీపీ స్కూల్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి టీచర్ రామచంద్ర ఎం శ్రీకాంత్ రెడ్డి భాస్కర్ రెడ్డి,అంగన్వాడీ కార్యకర్త లక్ష్మీ ప్రసన్న,ఆయా స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దేహాల్ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి..18 మంది అరెస్ట్

**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 14:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కళ్యాణదుర్గం డీఎస్పీ పర్యవేక్షణలో రాయదుర్గం రూరల్ సీఐ సూచనలతో బొమ్మనహాల్ మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసూల్ వారు సిబ్బంది తో కలసి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు,ఈ దాడిలో బొమ్మ..బొరుసు జూదం ఆడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు,వారి వద్ద నుంచి రూ.22,500 నగదు,52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు,నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.మండలంలో ఇంకాను జూదం,అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని,ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని బొమ్మనహాల్ సబ్ ఇన్స్పెక్టర్ నబిరసూల్ హెచ్చరించారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి.. తెలుగు దినపత్రిక
15 - 07 - 2026

# వైభవంగా శివాల పల్లి శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి అమావాస్య పూజలు



చెన్నూరు మన జనప్రగతి జూలై 14:-చెన్నూరు మండలం శివాల పల్లి లో జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం నందు ఈ జ్యేష్ఠ బహుళ అమావాస్య మంగళవారం ఉదయం 7:00 గంటలకు స్వామి వారికి పంచామృత పంచాభిషేకము పూజలు వైభవంగా నిర్వహించారు.శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారికి అభిషేక పూజలు ఉభయ దాతలు కీర్తిశేషులు చెన్నూరు మండలం బలిసింగాయపల్లి గ్రామానికి చెందిన దాదిరెడ్డి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి దాదిరెడ్డి భాగ్యమ్మ వారి కుమారుడు దాదిరెడ్డి సుధీర్ రెడ్డి వీరి సతీమణి దాదిరెడ్డి మధు మాలిక వీరి కుమార్తెలు దాదిరెడ్డి వేదాన్షిక,దాదిరెడ్డి దార్షిక మరియు వారి కుటుంబ సభ్యులు తో పాటు కొండపేట గ్రామానికి చెందిన తమటం నాగిరెడ్డి పత్తి తిరుపతమ్మ కడప నగరానికి చెందిన మోహన ఆచార్య శివాలపల్లె గ్రామానికి చెందిన ఆదిమూలం పెద్ద పుల్లయ్య గన్నేపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య పలువురు చే ఆలయం ప్రధాన అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ వేద మంత్రోజ్వాలాల మధ్య స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు,ముందుగా శ్రీశ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవాలయం( లక్కిరెడ్డిపల్లి) ప్రధాన ఆలయ అర్చకులు ఆదిమూలం రెడ్డి శేఖర్ గంగమ్మ దేవాలయం తరపున శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకానికి ఉపయోగపడే కేజీ బరువు గల ఇత్తడి జల్లెడ సమర్పించారు,స్వామివారికి వస్త్రాలు పూలు పండ్లు పాలు నెయ్యి దాదిరెడ్డి భాగ్యమ్మ కుటుంబ సభ్యులు సమర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు శ్రీ పొట్టి పా టి ప్రతాప్ రెడ్డి ఏర్పాటు చేయగా ముందుగా వినాయకునికి అభిషేక పూజలు వస్త్ర పూల అలంకరణ నిర్వహించారు, అనంతరం శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు,వస్త్ర పూల అలంకరణ నిర్వహించారు ,పూజలు అనంతరం ఆలయ ప్రధాన అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ దాదిరెడ్డి భాగ్యమ్మకు స్వామివారి తరపున పూలు పండ్లు తీర్థప్రసాదాలు అందించారు, భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయం తరపున ఆలయ వ్యవస్థాపకులు పి ప్రతాప్ రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఈ జేష్ట బహుళ అమావాస్య మంగళవారం కావడంతో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు, సమీప ప్రాంతాల గ్రామాల ప్రజలు రైతులు దర్శించుకున్న వారిలో ఉన్నారు ,

# ఓటర్ల నమోదు..సవరణలకు మరో అవకాశం

● ఈ నెల 24 వరకు గడువు పొడిగింపు ● ప్రతి ఓటరూ పేర్లు,వివరాలు పరిశీలించుకోవాలని జనసేన నేత డా.దాసరి రవిశంకర్ పిలుపు



వేంపల్లె మన జనప్రగతి జూలై 14:-ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువును ఈ నెల 24వ తేదీ వరకు కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిన నేపథ్యంలో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ కడప పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ సభ్యులు డాక్టర్ దాసరి రవిశంకర్ కోరారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని ఆయన తెలిపారు. కొత్త షెడ్యూల్ ప్రకారం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ జూలై 24లోగా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారని, అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వివరించారు.ఓటర్ల జాబితాలో తమ పేర్లు,వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ దాసరి రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శవ రాజకీయం జగన్ నైజం..
# పరామర్శ పేరుతో రాజకీయ కుట్ర

● 72 గంటల్లో పరిహారం అందించిన ఘనత చంద్రబాబుదే
● ప్రభుత్వం స్పందించలేదని జగన్ అనడం సిగ్గుచేటు
● ఏ.ఎఫ్.సి.ఓ.ఎఫ్ ఛైర్మన్ యాటగిరి




కడప మన జనప్రగతి జూలై 14:-బోటు ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ పర్యటన చేపట్టారని ఏపీ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ (ఏ.ఎఫ్.సి.ఓ.ఎఫ్)ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్ ఆరోపించారు. మంగళవారం కడప టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.ప్రమాదం జరిగిన పది రోజుల తర్వాత పరామర్శకు రావడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని, ప్రభుత్వం స్పందించలేదని జగన్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు సహాయక చర్యలు ప్రారంభించి, 72 గంటల్లోనే మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించారని తెలిపారు. బోటు కోల్పోయిన మత్స్యకారుడికి కొత్త బోటు అందించే చర్యలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.వైసీపీ పాలనలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు సరైన సహాయం అందలేదని, జీవో 217ను రద్దు చేసి మత్స్యకారులకు ఉపశమనం కల్పించింది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు.పడవలు, వలలు, ఐస్‌బాక్సులను సబ్సిడీపై అందించడం, గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ అమలు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రమాదాలను రాజకీయాలకు వాడుకోవడం జగన్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమావేశంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు, బెస్త నాయకులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా సాగుతున్న మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లు

● పర్యవేక్షించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 14:-ప్రొద్దుటూరులో జరగనున్న రాష్ట్ర విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణం,కార్యకర్తలకు కూర్చునే సదుపాయాలు,తాగునీటి ఏర్పాట్లు,వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ,భద్రతా చర్యలు,విద్యుత్,సౌండ్ సిస్టమ్,మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో, పార్టీ నాయకులతో చర్చించి పలు సూచనలు చేశారు. సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.అలాగే నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చే కార్యకర్తలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, సభను విజయవంతం చేయడానికి ప్రతి నాయకుడు,కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ పరిశీలన కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు నంద్యాల కొండారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సి.ఎం.సురేష్ నాయుడు, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అలాగే టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. ముక్తియార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.రేపు జరగనున్న నారా లోకేష్ పర్యటన,కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటికే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

# వియత్నాం బోటు ప్రమాద బాధితుడు ముడియం శ్రీధర్‌కు ఎమ్మెల్యే మాధవి నివాళి



కడప మన జనప్రగతి జూలై 14:-వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంలో దుర్మరణం చెందిన కడప నగరంలోని ఓం శాంతినగర్‌కు చెందిన నక్షత్ర మొబైల్స్ యజమాని, లావా మొబైల్స్ డిస్ట్రిబ్యూటర్ ముడియం శ్రీధర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం నివాళులర్పించారు.శ్రీధర్ నివాసానికి వెళ్లిన వారు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ముడియం శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ తీరని లోటును తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ డైరెక్టర్ సుబ్బరాయుడు యాదవ్, రామ్ లక్ష్మణ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ముడియం శ్రీధర్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# నేటితో పంటల బీమా గడువు ముగింపు..
# రైతులు నమోదు పూర్తి చేసుకోవాలి

● "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబులేసు సూచన ● సాగు చేసిన పంటకే బీమా ప్రీమియం చెల్లించాలన్న ఏ.ఓ




వేముల మన జనప్రగతి జూలై 14:-వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో నమోదు చేసుకునేందుకు నేటితో (జూలై 15) గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని వేముల మండల వ్యవసాయ అధికారి జి.పి ఓబులేసు సూచించారు. వేముల మండల పరిధిలోని స్థానిక చాగలేరు,గుండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం ఉదయం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులతో నేరుగా పొలాల్లో సమావేశమైన ఆయన ఖరీఫ్ సాగు,పంటల యాజమాన్య పద్ధతులు,పంటల బీమా ప్రయోజనాలపై వివరించారు.రైతులు తమ పొలాల్లో వాస్తవంగా సాగు చేసిన పంటకే బీమా ప్రీమియం చెల్లించాలని,తప్పు వివరాలతో నమోదు చేస్తే క్లెయిమ్ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు.ప్రకృతి వైపరీత్యాలు,అధిక వర్షాలు,వర్షాభావం వంటి పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం ఆర్థిక రక్షణగా నిలుస్తుందని చెప్పారు.అలాగే వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని,రైతులు వ్యవసాయ శాఖ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు కిషోర్ నాయక్,ఏపీఎంఐపీ వ్యవసాయ అధికారి మౌలాలి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు 0రైతులు పాల్గొన్నారు.



# వేంపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయండి

- వేంపల్లె డిప్యూటీ ఎంపీపీ బాబా షరీఫ్



వేంపల్లె మన జనప్రగతి జూలై 14:-వేంపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని వేంపల్లి మండల డిప్యూటీ ఎంపీపీ షేక్ బాబా షరీఫ్ గ్రామపంచాయతీ నూతన ఈవో గాండ్ల కవితను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన చింతల మడుగు పల్లి ఎంపీటీసీ సభ్యుడు పఠాన్ రహమతుల్లా ఖాన్ తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఈవోను కలిసి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత వేంపల్లి పంచాయతీకి రెగ్యులర్ ఈవో రావడం హర్షనీయమన్నారు.గ్రామపంచాయతీలో తాగునీరు, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు ఈవోను కోరారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ అభివృద్ధి అధికారి, వేంపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గౌతు కట్ల వెంకటసుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో కాలింగిరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

- వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి




వేంపల్లె మన జనప్రగతి జూలై 14:-రైతులు తమ పంటలకు సంబంధించి బీమా ప్రీమియాన్ని చెల్లించాలని వేంపల్లె మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి వెల్లడించారు.మంగళవారం టి.వెలమవారిపల్లి,బక్కన్నగారిపల్లి గ్రామాల్లోని రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలు, మెళుకువలను పాటించి మంచి దిగుబడి పొందాలని ఆకాంక్షించారు. అలాగే రైతులు ఈ క్రాప్ లో తమ పంటలను నమోదు చేసుకొని పంటల బీమా రుసుం చెల్లించాలన్నారు. సాగు చేసుకున్న పంట నష్టపోతే బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పంట సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ హారిక, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రెస్ అకాడమీ సెక్రెటరీ తేల్ల కస్తూరి భాయి కి ఏ.పి.ఎం.పి. ఏ.సన్మానం



విజయవాడ మన జనప్రగతి జూలై 14:- విజయవాడ లోని సీ ఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఇటీవల అకాడమీ ఇంచార్జ్ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించిన తేల్ల కస్తూరి భాయి ని ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఏ.పి.ఎం.పి.ఏ.) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా తో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఈ కార్యక్రమం లో ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి డా వివేక్ యాదవ్, పసుపులేటి చైతన్య, రాజా, ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ వల్లూరు ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోండి

• చెన్నూరు మండల వ్యవసాయ అధికారి కె.శ్రీదేవి





**చెన్నూరు;మన జనప్రగతి జులై 14:**-చెన్నూరు మండలంలో రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే శ్రీదేవి కోరారు ,చెన్నూరు మండలంశివాల పల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.మండల వ్యవసాయ అధికారి కే శ్రీదేవి మాట్లాడుతూ రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ అమౌంట్ ను బ్యాంకుల ద్వారా గాని, మీసేవ సెంటర్ ద్వారా గాని లేదా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వెబ్సైట్లో రైతులు సొంతంగా చేసుకునే అవకాశం కూడా కలదు అని తెలియజేసారు.జొన్న,మినుము,కంది, పసుపు పంటలకు ప్రీమియం జులై 31వ తేదీ లోపల చెల్లించవలసి ఉంటుంది. వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లించవచ్చును. ఇందుకు ఆధార్ కార్డ్, బ్యాంకు బుక్,పాస్ బుక్ అలాగే పంట వేసుకున్నట్టు సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ కావలెను. అదే కౌలు రైతుకు సిసిఆర్సి కార్డు గాని, ఓనర్ రైతు మరియు కౌలు రైతు మధ్య చేసుకున్న ఎగ్రిమెంట్ గాని సమర్పించవలసి ఉంటుంది అని చెప్పారు.అలాగే వాతావరణ ఆధారిత బీమా కింద వేరుశనగ, చీనీ బత్తాయి, అరటి పంటలకు జులై 15 వ తేదీ లోపల ప్రీమియం చెల్లించవలెను అని తెలియజేశారు. ఎల్ నీనో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం కంటే 40% తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి బదులు మినుము,కంది, కొర్ర,ఆముదము, కూరగాయలు వంటి పంటలు పండించాలని తెలియజేసారు. ప్రీ మన్సూను డ్రై సోయింగ్ కింద 25 రకాల విత్తనాలు పొలం లో చల్లుకొని భూమిని సారవంతం చేసుకోవాలి అని తెలిపారు.అలాగే లోతు దుక్కులు చేసుకొని పడిన వర్షం పొలంలోనే ఇంకినట్టు చేసుకోవాలి అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ బి పావని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది- ఎల్ వన్ వెంకటయ్య మరియు ఇతర సిబ్బంది,వీఆర్ఏ పుల్లయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణానికి సింగపూర్ సహకారం

- సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశం



**అమరావతి మన జనప్రగతి జులై 14:-** ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేసే దిశగా సింగపూర్ ప్రభుత్వం సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు సమావేశమై అమరావతి నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.అమరావతి అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టు నిర్వహణ అనుభవం, నిపుణుల శిక్షణ, ప్రణాళికా సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సింగపూర్ ప్రతినిధులు తెలిపారు. నాణ్యమైన మౌలిక వసతుల కల్పన, ప్రాజెక్టుల అమలులో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి నారాయణ మాట్లాడుతూ, అమరావతి నిర్మాణంలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించేలా సింగపూర్ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ సమావేశంలో సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్, సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ప్రైజెస్ సీఈఓ టే లియాన్ చి, డిప్యూటీ డైరెక్టర్లు లిమ్ చి కియా, నిషా షార్దా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## దూరంగా ఉన్నా ప్రజల చెంతనే.. సమస్య ఏదైనా స్పందన తక్షణం

- ముంబయి నుండి తాళ్లపాలెం పరిస్థితిని వీడియో కాల్ లో సమీక్షించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం



**నిడదవోలు మన జనప్రగతి జులై 14:** నిడదవోలు మండలం తాళ్లపాలెం వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలోకి పరిసర ప్రాంతాల చేలు, కాలువ నుండి భారీగా నీరు చేరడంతో తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ముంబయి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ కి ఈ విషయంపై సమాచారం అందిన వెంటనే సత్వరమే స్పందించి వీడియో కాల్ లో అక్కడి నుంచే పరిస్థితిని సమీక్షించారు. తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించాల్సిందిగా తన కార్యాలయ సిబ్బందిని, జిల్లా అధికార యంత్రాంగాన్ని, కూటమి నాయకులను ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న పరిస్థితులను మంత్రి దుర్గేష్ స్వయంగా వీడియో కాల్ ద్వారా వీక్షించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రెండు మూడు రోజులుగా ఈ సమస్యపై చర్చిస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత సిబ్బందితో పాటు ఇరిగేషన్ ఈఈ, నిడదవోలు ఎంపీడీవో ఆంజనేయ శర్మ, తహశీల్దార్ నాయక్ లు, కూటమి నాయకులు తక్షణమే తాళ్లపాలెం గ్రామానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చేల నుండి నీరు వంతెన క్రిందికి చేరి నిలిచిపోతుండటంతో ఇప్పటికే ఒకట్రెండు పర్యాయాలు తొలగించినప్పటికీ సమస్య పునరావృతమైందని మంత్రికి తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి దుర్గేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం వంతెన క్రింద నిలిచిన నీటిని తొలగించేందుకు, రాకపోకలను పునరుద్ధరించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. మంత్రి దుర్గేష్ ముంబయి పర్యటనలో ఉన్నప్పటికీ సాంకేతికతను ఉపయోగించుకుని స్థానిక సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన తీరు పట్ల తాళ్లపాలెం గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జై కూటమి అని నినదించారు.

## రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ రథం ఆపరేటర్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

• చెన్నూరు మండలానికి గర్వకారణంగా నిలిచిన సాదక్ పీర్



**చెన్నూరు మన జనప్రగతి జులై 14:**-చెన్నూరు మండలానికి చెందిన స్వచ్ఛ రథం ఆపరేటర్ శ్రీ బటాల్ సాబ్ గారి సాదక్ పీర్ రాష్ట్ర స్థాయిలో "బెస్ట్ పెర్ఫార్మింగ్ స్వచ్ఛ రథం ఆపరేటర్" అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణ తేజ, ఐఏఎస్ చేతుల మీదుగా అందుకోవడం చెన్నూరు మండలానికే కాకుండా వైఎస్సార్ కడప జిల్లాకు గర్వకారణమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. కిరణ్ మోహన్ రావు తెలిపారు.స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో సాదక్ పీర్ విశేష సేవలు అందించారని ఆయన కొనియాడారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ డ్రై వ్యర్థాల సేకరణ, తడిపొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడం, పారిశుధ్యంపై బాధ్యత పెంపొందించే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.అదేవిధంగా స్వచ్ఛ రథం ద్వారా గ్రామ ప్రజలకు అవసరమైన నిత్యావసర గృహోపకరణాలను అందుబాటులో ఉంచి, పేదధనిక అనే తేడా లేకుండా సేవలందించడం ద్వారా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.ఈ అవార్డు సాదక్ పీర్ కృషికి, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావానికి దక్కిన అత్యున్నత గుర్తింపని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర లక్ష్య సాధనలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మండల అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు సాదక్ పీర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం, డెంగ్యూ నివారణపై అవగాహన



**బొమ్మనహల్ మన జనప్రగతి జులై 14:**-మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్. ఈశ్వరయ్య మరియు హరేసముద్రం గ్రామంలో ఆర్‌డీటీ కాలనీలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్ అధ్వర్యంలో ప్రపంచ జనాభా నివారణ దినోత్సవం మరియు డెంగ్యూ వ్యాధి నివారణ మాసోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా సీహెచ్ఓ ఈశ్వరయ్య మాట్లాడుతూ..ఆరోగ్యమే మహాభాగ్యమని,ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు, అదేవిదంగా బాల్య వివాహాలు చేయరాదని,ఆడపిల్లలకు ఉన్నత విద్య అందించి స్వయం సమర్థులుగా తీర్చిదిద్దాలని తెలిపారు,వివాహం అనంతరం పిల్లల మధ్య కనీసం 2 నుంచి 3 సంవత్సరాల విరామం ఉండేలా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులను పాటించాలని వివరించారు,ముఖ్యంగా డెంగ్యూ నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం డ్రైడేఫ్రైడే పాటించాలని,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్రపరిచి గంటసేపు ఆరబెట్టి మూతలు ఉంచాలని సూచించారు.మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకుని దోమల పెరుగుదలను అరికట్టాలని, డెంగ్యూ,మలేరియా,వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్టాఫ్ దయేరియా,చేతులు శుభ్రంగా కడుక్కోవడం (హ్యాండ్‌వాష్) యొక్క ప్రాముఖ్యతను వివరించారు,ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, ఏఎన్ఎం భాగ్యశ్రీ,మలేరియా కార్యకర్త భీమ,అంగన్‌వాడీ కార్యకర్త అరుణ,ఆశ కార్యకర్తలు హేమావతి,రంగవేణి,శివమ్మతో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి మన జనప్రగతి జులై 14:-** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం జనసేనాని పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు..

## నేమకల్లు ఆంజనేయునికి అమావాస్య ప్రత్యేక పూజలు



**బొమ్మనహల్ మన జనప్రగతి జులై 14:**-మండల పరిధిలో నేమకల్లు గ్రామంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన ఆంజనేయస్వామి బాలాలయంలో మంగళవారం అమావాస్య స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్యర్యంలో స్వామిని పట్టువస్త్రాలు,పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పురోహితులు వేకువజాము నుంచే స్వామి వారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం,ఆకుపూజ, విశేష పూజా అలంకరణ, అర్చనలు నిర్వహించారు,ఈ ఈ పుణ్యక్షేత్రంలో ధీరిన అంజన్న ను దర్శనం కోసం ఆలయంలో పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు,అదేవిదంగా కర్ణాటక,ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాది మంది ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

- మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



**పటాన్ చెరువు మన జనప్రగతి జులై 14:**-కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీఎంసీ అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలో బీఎల్వోలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను పరిశీలించారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూర్తి చేయాలని సూచించారు.ఓటరు జాబితాల పారదర్శకత, ఖచ్చితత్వం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని, సరైన వివరాలను నమోదు చేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను ఒకసారి సరిచూసుకుని అవసరమైన మార్పులు ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.అనంతరం రామచంద్రరెడ్డి నగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యుల ఎన్యుమరేషన్ ఫారమ్‌లను బీఎల్వో, సూపర్వైజర్‌లకు అందజేశారు. ప్రజలు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా నిర్ణీత గడువులోపు తమ ఫారమ్‌లను పూర్తి చేసి బీఎల్వోలకు అందించాలని కోరారు ఎన్నికల సిబ్బంది, బీఎల్వోలు, సూపర్వైజర్లు, స్థానిక నాయకులు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## కాపు ఉద్యమకారుడు మాజీ మంత్రి ముద్రగడ మృతిపై పలువురు సంతాపం



**కాకినాడ మన జనప్రగతి జులై 14:**-ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే కాకుండా యావత్ రాష్ట్రం తన వైపు తిప్పుకునేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరనిలోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైనా ఎంత చాగానికి అయిన తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం చివరి దశలో కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయనకు ఒక మచ్చని తెచ్చిపెట్టింది లేకుంటే రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది కానీ ఆయన తీసుకున్న కొన్ని తొందరపాటు నిర్ణయాల వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా కుటుంబానికి కూడా తీరనిలోటని ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్ర రాష్ట్రానికి కాపు జాతికి తీరనిలోటని ఆయన అభిమానులు రాజకీయ నాయకులు పలువురు అభిప్రాయపడ్డారు.

మనజనప్రగతి

15 - 07 - 2026

# కడప పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి

**• రూ.3,478 కోట్ల పెట్టుబడితో దాల్మియా సిమెంట్ లైన్2 విస్తరణ**

**• నేడు మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన**



**కడప మన జనప్రగతి జూలై 14:–** వైఎస్సార్ కడప జిల్లాను రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అగ్రస్థానంలో నిలిపే దిశగా మరో భారీ పెట్టుబడి కార్యరూపం దాల్చుతోంది. దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ రూ.3,478 కోట్ల వ్యయంతో చేపడుతున్న లైన్2 విస్తరణ ప్రాజెక్టుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పరిశ్రమలకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ఫలితంగా కడప జిల్లా పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో పారిశ్రామిక వృద్ధికి మరింత ఊతం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి.ప్రస్తుతం కడప జిల్లాలో సిమెంట్ రంగం వేగంగా విస్తరిస్తోంది. సుమారు ల16 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతోలి పలు భారీ సిమెంట్ యూనిట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దాల్మియా సిమెంట్ చేపడుతున్న ఈ విస్తరణ పూర్తయిన తర్వాత సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 12.6 మిలియన్ టన్నులకు చేరుకోనుంది. దీంతో దేశీయ మార్కెట్‌తో పాటు ఎగుమతుల పరంగా కూడా సంస్థ మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 354 మందికి కొత్తగా ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, సంస్థలో మొత్తం ప్రత్యక్ష ఉద్యోగాల సంఖ్య 954కు పెరగనుంది. అదనంగా రవాణా, గనుల తవ్వకం, నిర్మాణ రంగం, యంత్రాల నిర్వహణ, లాజిస్టిక్స్, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సంస్థలు, సేవారంగాల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి.ప్రాజెక్టుకు ఇటీవలే లికేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖఎనుంచి పర్యావరణ అనుమతి, అలాగే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి స్థాపన అనుమతి లభించడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. దీంతో పనులు వేగవంతంగా ప్రారంభమై నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి సంస్థ సన్నాహాలు చేపట్టింది. ఈ విస్తరణతో స్థానిక రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఊతం లభించనుంది. స్థానిక సరఫరాదారులు, చిన్న కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్ట్ రంగం, నిర్మాణ సామగ్రి వ్యాపారులు, యంత్రాల విడిభాగాల తయారీదారులకు కొత్త వ్యాపార అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో నగదు ప్రవాహం పెరిగి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడనుంది. అంతేకాకుండా సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (కార్యక్రమాల ద్వారా విద్య, వైద్యం, తాగునీరు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కడప జిల్లాను దక్షిణ భారత పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి దాల్మియా సిమెంట్ లైన్2 విస్తరణ మరో బలమైన అడుగుగా నిలవనుందని పారిశ్రామిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తయితే జిల్లాకు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షితమయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

# జెడ్పీ హైస్కూల్‌లో మహిళల భద్రతపై అవగాహన సదస్సు



**చిట్వేలి మన జనప్రగతి జూలై 14:–** రైల్వే కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో,చిట్వేలి మండలం నాగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చిట్వేలి ఈఎస్ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, గృహ హింస, లైంగిక వేధింపులు, ఇతర నేరాలకు గురైన వెంటనే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ప్రతి మహిళ తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చట్టం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు,ముఖ్యంగా విద్యార్థులు,మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, వీడియో కాల్స్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని హెచ్చరించారు.సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.గంజాయి వినియోగం ఆరోగ్యాన్ని, విద్యను, కుటుంబ జీవితాన్ని మరియు భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మహిళలు ప్రయాణాల సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో కుటుంబ సభ్యులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, వాహనం నంబర్‌ను నమోదు చేసుకోవడం, అవసరమైతే లైవ్ లొకేషన్‌ను షేర్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 పోలీస్ ఎమర్జెన్సీ సర్వీస్, 181 మహిళల హెల్ప్‌లైన్, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫిర్యాదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు మంచి నడవడి, క్రమశిక్షణ, పరస్పర గౌరవ భావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమని, యువత చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు మరియు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిద్దీన్, ఏపీఎం చంద్రకళ, మండల ప్రజారోగ్య & విస్తరణ అధికారి ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖారాణి, పోలీసు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అబద్ధాల పునాదులపై పుట్టిందే గొడ్డలి పార్టీ

**మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు**

**వైసీపీ హయాంలో 277 మంది మత్స్యకారులు మృతిచెందినా ఒక్కరిని కూడా పరామర్శించలేదు**

**రూ.10 లక్షల సాయాన్ని 'ముష్టి' అనడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనం**

**10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం జగన్ అజ్ఞానానికి ప్రతీక**

**అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




**అమరావతి,మన జనప్రగతి జూలై 14:–** మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ పర్యటనను జగన్ ప్రజా సమస్యల కోసం కాకుండా రాజకీయాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. విశాఖ సముద్రంలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనలో ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడం ప్రభుత్వ మానవత్వానికి నిదర్శనమన్నారు. ఆ సాయాన్ని 'ముష్టి'గా అభివర్ణించడం బాధితులను అవమానించడమేనని అన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా 277 మంది మత్స్యకారులు మృతిచెందినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని విమర్శించారు. అలాగే 10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు.ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వానికి వెంటనే సమాచారం చేరే వ్యవస్థను అమలు చేశామని తెలిపారు. ప్రమాద సమయంలో ట్రాన్స్‌పాండర్ స్విచ్ నొక్కకపోవడంతో గల్లంతైన వారి ఆచూకీ వెంటనే లభించలేదన్నారు.గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా కింద రూ.531 కోట్లు ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.511 కోట్లు అందించిందని చెప్పారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీని తిరిగి ప్రారంభించినట్లు వెల్లడించారు.మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి రోడ్డు ప్రమాదం కేసులో నిజాలు సీసీ కెమెరా దృశ్యాలతో వెలుగులోకి వచ్చాయని, చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌తో ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.

## జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత రాక



**కడప మన జనప్రగతి జూలై 14:–** జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత కడపకు విచ్చేశారు. బుధవారం జమ్మలమడుగులోని దాల్మియ సిమ్మెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత పాల్గొననున్నారు. మంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. రూ. 3,478 కోట్లతో జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ లైన్–2 ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. సిమ్మెంట్ పరిశ్రమ విస్తరణ పనుల్లో జిల్లా ఇన్చార్జిమంత్రి సవిత పాల్గొనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి 6.30 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా జమ్మలమడుగుకు చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. దాల్మియా సిమ్మెంట్ విస్తరణ పనుల శంకుస్థాపన అనంతరం జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుని, విజయవాడకు మంత్రి సవితపయనమవుతారనిమంత్రికార్యాలయంఆప్రకటనలో తెలిపింది.

## ప్రొద్దుటూరు అభివృద్ధే లక్ష్యం..చట్టం ముందు అందరూ సమానమే

**రాచమల్లు ఆరోపణల్లో ఆధారాలు లేవు**

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**



**ప్రొద్దుటూరు మన జనప్రగతి జూలై 14:–** ప్రొద్దుటూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు.కడప జిల్లాను విద్యా, పారిశ్రామిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రొద్దుటూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని చెప్పారు.తన కుటుంబ సభ్యులైనా చట్టం ముందు సమానమేనని, తప్పు చేసిన వారిపై చట్టం తన పని తాను చేసుకుంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు **ఆరోపణలకు ఆధారాలు చూపాలి: డాక్టర్ ముక్తియార్** మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వి.ఎస్. ముక్తియార్ అన్నారు. ఆధారాలు లేకుండా ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## అమావాస్య సందర్భంగా అగస్త్యేశ్వర స్వామికి వైభవంగా విశేష పూజలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 14:–** స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా మంగళవారం ప్రదోషకాలంలో స్వామివారికి అత్యంత వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నానావిధ సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం,సహస్రనామ భస్మార్చన, భస్మహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు.ఈ విశేష పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొని శ్రీ అగస్త్యేశ్వర స్వామి,అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ కార్యక్రమాలు ఆలయ ఈవో కే.వి. రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములచే వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి.

# భారత్ - యూకే వాణిజ్య ఒప్పందం



## ప్రతి భారతీయుడికీ అపార అవకాశాలు

**న్యూఢిల్లీ మన జనప్రగతి జూలై 14:**-నేటి నుండి, సమగ్ర ఆర్థిక మరియు వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) అమలులోకి రావడంతో, యూకేకు జరిగే భారతీయ ఎగుమతుల్లో దాదాపు అన్నీ సుంక రహిత ప్రవేశాన్ని పొందుతాయి; ఇది మన చిన్న తరహా వ్యాపారాలు, రైతులు, మత్స్యకారులు, ఆవిష్కర్తలు, మహిళలు మరియు శ్రమశక్తి ఆధారిత కలిగిన పరిశ్రమలకు భారీ అవకాశాలను కల్పిస్తుంది.ఇది భారతదేశపు అత్యంత సమగ్రమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ), ఇది అనేక ఉద్యోగాలు, వాణిజ్య అవకాశాలను సృష్టించడం ద్వారా దేశ ఆర్థిక రంగాన్ని ఎంతగానో బలోపేతం చేస్తోంది. అంతే కాదు.. అంతర్జాతీయ మార్కెట్ పోటీని తట్టుకునేలా మన దేశీయ తయారీదారులను క్రమంగా సన్నద్ధం చేస్తుంది. దీంతో.. ప్రతి పౌరుడికి తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు అందుబాటులోకి వస్తాయి. ఈ పరిణామాలు ప్రధాని మోదీ సంకల్పించిన 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడంలో మరింత వేగవంతం చేస్తాయి.ఈ ఒప్పందంతో వ్యాపార వర్గాలు సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది. బ్రిటన్ కు సరుకులను ఎగుమతి చేసే సంస్థలు విస్తృతమైన ప్రణాళికలతో సిద్ధమయ్యాయి. రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారులు మూడేళ్ల లోపే 230 శాతం ఎగుమతులు పెరిగి వి2.5 బిలియన్లకు చేరుకుంటాయని భావిస్తుండగా, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు రాబోయే 4-5 ఏళ్లల్లో దాదాపు రెట్టింపై వి7.5 బిలియన్లకు చేరుకుంటాయని ఆశిస్తున్నారు.గతేడాది ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో కుదిరిన ఈ పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం, దాదాపు 99శాతం టారిఫ్ లైన్లపై సుంకాలను తక్షణమే రద్దు చేస్తోంది. ఇది దాదాపు 100 శాతం వాణిజ్య విలువలుకు వర్తిస్తుంది, ప్రపంచ అస్థిరతల మధ్య కూడా ఇప్పటికే అద్భుతంగా వృద్ధి చెందుతున్న భారతీయ ఎగుమతులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది. **యువ మనస్సులు, ప్రపంచ ఆవిష్కరణలు** ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా రూపుదిద్దుకున్న ఈ ఎఫ్టీఏ జూలై 15న అమలులోకి వస్తుంది, విశేషమేమిటంటే.. ఈ రోజు "ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం" కూడా. 2015లో సరిగ్గా ఇదే రోజున, ప్రధాని మోదీ 'స్కిల్ ఇండియా మిషన్'ను ప్రారంభించారు. ఆ నైపుణ్య శిక్షణే నేడు మన యువతను కేవలం భారత్ లోనే కాక, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు, రాణించేందుకు, నాయకత్వం వహించేందుకు సన్నద్ధం చేస్తోంది. భారతీయ యువత ప్రయోజనం కోసం, బ్రిటన్ తన సేవా రంగంలో అత్యంత సమగ్రమైన భాగస్వామ్యానికి అంగీకరించింది. భారతదేశానికి ఎగుమతి అవకాశాలున్న అన్ని ప్రధాన రంగాలు సహా మొత్తం 137 ఉప రంగాలను ఇందులో చేర్చారు. మెరుగైన మార్కెట్ ప్రవేశం, స్పష్టమైన నియంత్రణల వల్ల ఐటీ, ఐటీ-ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు, వృత్తిపరమైన సేవలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఇంజనీరింగ్, టెలికాం, కన్సల్టెన్సీ సేవలలో భారతీయ నిపుణులకు ఎంతో మద్దతు ఇస్తుంది. **ఉద్యోగాల సృష్టి** మార్కెట్ పరిధి విస్తరించడం వల్ల రత్నాలు-ఆభరణాలు, వస్త్రాలు, తోలు-పాదరక్షలు, సేంద్రీయ రసాయనాలు, ప్లాస్టిక్స్, ఆటో విడిభాగాలు, హస్తకళల ఉత్పత్తులు, ఆహార శుద్ధి వంటి శ్రమశక్తి ఆధారిత పరిశ్రమలు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తాయి. దీనివల్ల యువతకు మరింతగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మొత్తంగా, ప్రపంచ విలువ గొలుసులతో అనుసంధానం కావడం, దేశీయ పరిశ్రమల పోటీతత్వాన్ని పెంచడం ద్వారా, అంతర్జాతీయ మార్కెట్లలో రాణించడానికి, దేశాభివృద్ధిని నడపడానికి అవసరమైన నైపుణ్యాలు, అవకాశాలను భారతీయ యువతను సీఈటీఏ అందిస్తుంది.ఈ ఒప్పందంలోని ముఖ్యమైన అంశం 'డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్'. సీఈటీఏ తో పాటు అమలులోకి వచ్చే ఈ మైలురాయి లాంటి ఏర్పాటు ద్వారా, తాత్కాలిక విధుల్లో భాగంగా యూకే వెళ్లే భారతీయ ఉద్యోగులు, వారి యజమానులు అక్కడ రెండుసార్లు సామాజిక భద్రతా సహకారాన్ని చెల్లించాల్సిన అవసరం ఉండదు. తాత్కాలిక విదేశీ ప్రాజెక్టులపై వెళ్లే ఉద్యోగుల నిరంతర సామాజిక భద్రతా కవరేజీ ద్వారా 75,000 కంటే ఎక్కువ మంది భారతీయ నిపుణులు, 900 కంటే ఎక్కువ సంస్థలు ప్రయోజనం పొందుతాయని భావిస్తున్నారు.**స్థానికంగా ఎదగండి, ప్రపంచవ్యాప్తంగా విక్రయించండి** బ్రిటన్ కి చెందిన వి37.5 బిలియన్ల మార్కెట్ అందుబాటులోకి రావడంతో భారతీయ రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇది భారతీయ పాల ఉత్పత్తులు, టీ, కాఫీ, మసాలా దినుసులు, పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు, మాంసాలు, శుద్ధి చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచుతుంది. బ్రిటన్ దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తులలో దాదాపు 95 శాతం రకాలకు భారతదేశం నుంచి ఎలాంటి సుంకాలు లేని ప్రవేశాన్ని కల్పించారు. దీంతో బ్రిటన్ లోని భారీ మార్కెట్‌కు మన దేశం నుంచి జరిగే వ్యవసాయ ఎగుమతులు రాబోయే మూడేళ్లలో 50 శాతం వరకు పెరిగే అవకాశముంది. ఇది వ్యవసాయ ఆదాయాలను పెంచడమే కాక, వ్యవసాయ ఆధారిత అనుబంధ రంగాలలో సరికొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది.ముఖ్యంగా, డెయిరీ, కూరగాయలు, ఆపిల్స్, వంట నూనెలు, ఓట్స్, చిరుధాన్యాలు, ఇతర సున్నిత వ్యవసాయ ఉత్పత్తులను సున్నితమైన జాబితా (సెన్సిటివ్ లిస్ట్) లో ఉంచడంతో ఈ ఒప్పందం వాటికి పూర్తి రక్షణ కల్పిస్తుంది. ఈ వస్తువులపై యూకేకు ఎటువంటి సుంకం మినహాయింపులు ఇవ్వలేదు. ఈ మినహాయింపులు ఆహార భద్రత, దేశీయ ధరల స్థిరత్వం, బలహీనమైన వ్యవసాయ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే మోదీ ప్రభుత్వ వ్యూహాన్ని ప్రతిబింబిస్తాయి. **ఎస్ఎంఈలు - స్థానిక కృషి, ప్రపంచ స్థాయి బలం** ప్రధాని మోదీ ఎల్లప్పుడూ భారతదేశ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (రావీజుం) అధిక ప్రాధాన్యత ఇస్తారు. 2024-25లో భారతదేశ మొత్తం ఎగుమతుల్లో 45.8శాతం వాటాను కలిగిన కీలకమైన ఎస్ఎమ్ఈ రంగానికి సహాయం చేయడానికి సీఈటీఏ లో ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చారు. వేగవంతమైన కస్టమ్స్ ప్రాసెసింగ్, డిజిటల్ ట్రేడింగ్ వ్యవస్థల గుర్తింపు, సులభతరం చేసే ఒప్పందాలు, కాగితరహిత వాణిజ్యంతో సహా కీలకమైన నిబంధనలతో సీఈటీఏ చిన్న పరిశ్రమలకు ఎంతో తోడ్పడుతుంది.ప్రాధాన్యత కలిగిన మార్కెట్ అవకాశాలతో పాటు, వాణిజ్యం, విద్య, ఆర్థికం, డిజిటల్ నైపుణ్యాలు, వ్యాపార మౌలిక సదుపాయాలు, ఇతర ముఖ్యమైన రంగాలకు సంబంధించిన ఉత్తమ పద్ధతులపై మెరుగైన సహకారం ద్వారా ఎస్ఎంఈలు ప్రయోజనం పొందుతాయి.**మత్స్యకారులకు పెద్ద లబ్ధి** దాదాపు 2.8 కోట్ల మంది జీవనోపాధికి మద్దతుగా నిలిచే భారతదేశ మత్స్య, ఆక్వా రంగానికి ఈ ఒప్పంద గణనీయమైన ప్రయోజనం చేకూర్చనుంది. మెరుగైన మార్కెట్ ప్రవేశం, అధిక ఎగుమతుల వల్ల ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తీరప్రాంత మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇది భారత మత్స్య ఎగుమతులను బలోపేతం చేయడమే కాక, మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధికి దోహదం చేస్తుంది, తీరప్రాంత ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.**మహిళలకు విజయం** సంప్రదాయ ఎఫ్టీఏల కంటే ఎంతో విస్తృతమైన ఈ చారిత్రక ఒప్పందం, నిరంతర, సమగ్ర ఆర్థిక వృద్ధిని సాధించడంలో మహిళల సహకారాన్ని గుర్తిస్తుంది. ఇది మహిళలకు సమాన అవకాశాలు, ఆర్థిక లబ్ధి చేకూర్చడమే దీని ముఖ్య ఉద్దేశం.మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న రంగాలలో మహిళల పాత్రను పెంచడానికి, వారి ఆర్థిక సాధికారత, అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, పని ప్రదేశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి సామర్థ్యాన్ని, నైపుణ్యాలను పెంపొందించడం వంటి వివిధ అంశాలపై ఇరు దేశాలు సంయుక్తంగా పనిచేసేందుకు అంగీకరించాయి.సీఈటీఏ అనేది కేవలం ఒక వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు. ఇది భారతదేశ సామర్థ్యాలు, ఆకాంక్షలపై ప్రపంచ దేశాలకున్న నమ్మకానికి నిదర్శనం. ఇది ప్రపంచ వాణిజ్యంలో కేవలం ఒక భాగస్వామిగానే కాకుండా, దాన్ని శాసించే స్థాయికి ఎదిగిన నూతన భారతదేశాన్ని ప్రతిబింబిస్తుంది. మన రైతులు, మత్స్యకారులు, కార్మికులు, మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్న పరిశ్రమలు, నిపుణులు, యువతకు సాధికారత కల్పించడం ద్వారా, ఈ ఒప్పందం దేశంలోని ప్రతి మూలలోని భారతీయుడి జీవితంలో సానుకూల మార్పును తీసుకువస్తుంది.

# పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పీఎంఎఫ్‌బీవైపై అవగాహన

**ఖరీఫ్ బీమా మార్గదర్శకాలు విడుదల**

**పంటల బీమా రైతాంగానికి కొండంత ధీమా**

**మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 14:**పులివెందుల మండలం, నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై పై) గురించి రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా రైతులకు ధీమా అని తెలిపారు.ఈ ఖరీఫ్ సీజన్ లో పంటల బీమా కి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలు ను ప్రకటించింది అని తెలిపారు.2026 ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకొనుటకు అనుమతి(నోటిఫైడ్) పొందిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రైతులను కోరారు.ఈ సీజన్ లో రైతులే ప్రీమియం అమౌంట్ ను కామన్ సర్వీస్ సెంటర్ లో కాని,గ్రామ సచివాలయం లో కానీ కట్టాలన్నారు.పంటల బీమా ను రెండు కేటగిరీలుగా విభజించారు అని తెలిపారు 1.దిగుబడి ఆధారిత బీమా పథకం(పీఎంఎఫ్‌బీవై)కింద కేటాయించిన పంటలు వరి,జొన్న,కంది,మినుము,పసుపు,ఉల్లి పంటలకు జులై 31 తేదీ లోపల పంటల బీమా





ప్రీమియం డబ్బులు కట్టాలన్నారు.వరికి ఎకరానికి రూ 85,జొన్నకు రూ38, కందికి రూ36, మినుముకు రూ 38,ఉల్లికి రూ91, పసుపు కు రూ 182 ప్రీమియం అమౌంటును రైతులు ఫ్యూచర్ జనరల్ సెంట్రల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మీద బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. 2. వాతావరణ ఆధారిత బీమా పథకము (అర్డబ్ల్యూబీసీఐఎస్)దిగుబడి ఆధారిత బీమా పథకం కింద కేటాయించిన పంటలు వేరుశనగ,పత్తి, అరటి,టమోటా,చీని,నిమ్మ పంటలకు జూలై 15వ తేదీ లోపల పంటల బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు.వేరుశనగకు ఎకరానికి 562 రూ,పత్తికి ఎకరానికి 2023 రూ,అరటి కి ఎకరానికి 3061 రూ, చీని,నిమ్మకు ఎకరానికి 2782 రూ లను రైతులు ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరుమీద బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు.బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతుల ఇన్సూరెన్స్ ప్రీమియం అమౌంటును సంబంధిత బ్యాంకు లే ఇన్సూరెన్స్ కంపెనీకి జమ చేస్తారని తెలిపారు. బ్యాంకుల్లో రుణాలు పొందని రైతులు ఆయా గ్రామాల రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి వారిచే పంట ధ్రువీకరణ పత్రం తీసుకొని భూమి పాసుబుక్,ఆధార్ కార్డు మరియు బ్యాంకు పాసుబుక్ ని తీసుకొని కామన్ సర్వీస్ సెంటర్ లో సమర్పించి పంటల బీమా ప్రీమియం అమౌంట్ ను పే చేయాలన్నారు.రైతులు సాగు చేసిన పంటలకే పంటల బీమా ప్రీమియం చెల్లించి పంట నమోదు కూడా చేయించుకోవాలని రైతులకు తెలిపారు.ఫసల్ బీమా పథకం పంట నమోదు తో లింకు చేయబడినది కాబట్టి పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్ ) కాకపోతే ఫసల్ బీమా పథకం వర్తించదు అని రైతులు గమనించాలి అని తెలిపారు.అలాగే కంది పంట సాగు చేసే రైతులకు 50%సబ్సిడీతో కంది విత్తనాలు మరియు పూర్తి ఉచితంగా కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని కావలసిన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు,రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ - 202

**నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు అన్నమయ్య జిల్లాలో ఏర్పాట్లు పూర్తి**




**మదనపల్లె మన జనప్రగతి జూలై 14:**-అమరావతి ఛాంపియన్‌షిప్2026లో భాగంగా నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల కోసం అన్నమయ్య జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు అండర్17 మరియు అండర్23 బాలురు, బాలికలకు మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని మదనపల్లె,రాయచోటి, తంబళ్లపల్లె,పీలేరు, రాజంపేట,రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రాల్లో జూలై 20 నుంచి 25 వరకు దశలవారీగా పోటీలు నిర్వహించనున్నారు.వాలీబాల్,బ్యాడ్మింటన్, చెస్, ఖో-ఖో,బాస్కెట్‌బాల్, హాకీ,ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా, బాక్సింగ్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జిలను నియమించి, వారి సంప్రదింపు వివరాలను కూడా ప్రకటించినట్లు తెలిపారు.పోటీల నిర్వహణ కోసం ప్రతి నియోజకవర్గంలో సంబంధిత పీ.ఈ.టి లు,పీ.డి లను నియమించి,ఎస్.జి.ఎఫ్ కార్యదర్శులతో సమన్వయం చేస్తూ అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా విద్యాశాఖ సహకారంతో వేదిక పాఠశాలల్లో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించే ఏర్పాట్లు కూడా చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పేర్కొన్నారు.

# ఆర్జెడి తిమ్మప్పకు ఘన సత్కారం



**విజయవాడ, మన జనప్రగతి, జూలై 14:-** ఇటీవల రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడి)గా పదోన్నతి పొందిన తిమ్మప్పను మంగళవారం విజయవాడలో ఘనంగా సత్కరించారు.మన జనప్రగతి తెలుగు దినపత్రిక మరియు న్యూస్ అలెర్ట్ ఇంగ్లీష్ పత్రిక ఎండీ డాక్టర్ వై. వివేకానంద రెడ్డి యాదవ్, అనంత జనశక్తి ఎండీ వెంకటేశ్వర్లు, అనంతపురానికి చెందిన శ్రీనివాసులు నాయుడు తదితరులు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లాకు చెందిన తిమ్మప్ప ఇంతటి ఉన్నత పదవిని అధిరోహించడం జిల్లాకు, ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.సత్కారానికి స్పందించిన ఆర్జెడి తిమ్మప్ప మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులు, దేవుని అనుగ్రహం ఉన్నంతకాలం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పనులు, పథకాలపై సరైన సమాచారం అందించడంలో మీడియా ముందుండాలని, వారి యోగక్షేమాల కోసం తమ వంతు సహకారం అందిస్తామని తిమ్మప్ప తెలిపారు.

# విజయవాడ జర్నలిస్ట్‌లకు త్వరలో శిక్షణా తరగతులు

**• సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్**

**ఆలపాటి సురేష్ కుమార్**

**అమరావతి మన జనప్రగతి జూలై 24:-** అమరావతి విజయవాడ జర్నలిస్ట్ లకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సీ ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ వెల్లడించారు. విజయవాడ లోని సీ ఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి డా. వివేక్ యాదవ్, పసుపులేటి చైతన్య, రాజా, ప్రశాంత్, సీనియర్ జర్నలిస్ట్ వల్లూరు ప్రసాద్ కుమార్ తదితరులు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ను కలిసి జర్నలిస్ట్ ల సమస్యల పై చర్చించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో జర్నలిస్ట్ లకు శిక్షణా తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన త్వరలో కృష్ణా జిల్లాతో పాటు ఎన్టీఆర్ జిల్లాలో కూడా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174